# హృదయము ప్రతీకారంకొరకు పరితపించినప్పుడు

## (1 సమూ. 24-26; 2 సమూ. 1)

ఈ పాఠాన్ని చదివేవాళ్లందరూ నాకు తెలియదు గాని - ప్రతివానిని గూర్చి - నేనెన్నడు కలిసికొననివారిని గూర్చి కూడా నాకొక సంగతి తెలుసు: ప్రతి ఒక్కరు మరొకరిచేత బాధింపబడియుంటారు. అది చాల సంవత్సరాల క్రితం అయ్యుండవచ్చు, అయితే నీవు బాధింపబడ్డావు. ఒకవేళ స్నేహితుడే నీ నమ్మకాన్ని మోసగించియుండవచ్చు. ఒకవేళ టీచరో, లేక యజమానియో, కోచో నిన్ను అమర్యాదగా చూచియుండవచ్చు. ఒకవేళ కుటుంబ సభ్యుడే నిన్ను అవమానించి ఉండవచ్చు. ఒకవేళ ఎరిగినవాడే నీవల్ల లాభాన్నినొంది ఉండవచ్చు. నీ సహచరి నిన్ను వదలి ఉండచ్చు. ఒకవేళ ఒక శత్రువు జీవితాన్ని నాశనం చేయాలని సమకట్టియుండవచ్చు. మనమందరం ఒకే విధంగా బాధింపబడక పోవచ్చు, కాని మనందరం బాధింపబడినవారమే.

కొద్దిసేపు మరొకనినుండి నీవు పొందిన అతి పెద్ద గాయాన్ని గూర్చి ఆలోచించు. ఆ హృదయ వేదనను గుర్తు చేసికొనడానికి ప్రయత్నించు. అలాంటి విపత్కర సమయంలో నేను నీ వద్దకొచ్చి మెరుస్తున్న మెటల్ బాక్సను ఇచ్చానని అనుకో, దాని వెనుక ఎర్రని బటన్ ఉంది. "నీవు ఈ బటన్ నొక్కావంటే, నీవు ప్రస్తుతం అనుభవించుతున్న బాధయే, నిన్ను బాధించిన వ్యక్తి అనుభవిస్తాడు. నీవు అలాటి ఒక బటన్ నొక్కావని నీకు తప్ప యింక ఎవరికి తెలియదు" అని నేను చెప్పాను. తరువాత నేను వెళ్లిపోయాను. నేను నిన్నొక ప్రశ్న అడగనీ: నీవు అనుభవిస్తున్న బాధను గుర్తుకు తెచ్చుకొని, నీవు ఆ బటన్ను నొక్కుతావా?

ఒకటి మాత్రం నిశ్చయం: మన చుట్టునున్న లోకం, "పుష్ ద బటన్! పుష్ ద బటన్!" అని అరుస్తుంది. ప్రకటన పురికొల్పుతుంది. కాని నేను భ్రమించను. సహజంగానే ఉంటాను. సినిమా ప్రకటన "సాగిపో, విజయాన్నందుకో" అంటుంది. టి.వి.వ్యాపార ప్రకటన, "నీవు బాధపడ్డావా లాయరును పిలువు, నష్టపరిహారం కట్టించుకుందాం"[1] అని అరుస్తుంది. లోకం అంత ప్రతీకారంకోసం రంకెలు వేస్తుంది. మన యోధులంతా తమను బాధపెట్టిన వాళ్ళచేత నష్టపరిహారం పొందినవాళ్ళే. (ఒక చెంపనుకొడితే రెండో చెంపను[2] తిప్పికొట్టించుకున్నవాణ్ణి "యోధుడు" అనడం నువ్వెప్పుడు చూసావు?)

అది కష్టం; కదా? మనమీద నిందమోపబడినప్పుడు, దూషింపబడినప్పుడు, మనను దురుపయోగ పరచుకున్నప్పుడు, మన హృదయం ప్రతీకారంకోసం సహజంగానే పరితపిస్తుంది. మన ఆలోచన పగ తీర్చుకొనడమనే బటన్ను నొక్కాలని కోరుతూ ఉంటుంది. ఏదియేలాగున్నా, క్రైస్తవుని ఎదుట ఉన్న ప్రశ్న ఏమంటే - "నన్ను ఆ బటన్ నొక్కమని దేవుడు అంటాడా?" మరొక ప్రశ్న ఏమంటే, "మనం అలా చేయలేదనుకో

నన్ను లోబరచుకొంటున్న ఆ కోర్కెతో వ్యవహరించుట ఎలా?" పాక్షికంగా ఈ ప్రశ్నలకు దావీదు జీవితాన్ని చదివేటప్పుడు జవాబు చెప్పడానికి నిరీక్షిస్తాం. మన ముఖ్యమైన లేఖన భాగం 1 సమూ. 24-26. ఈ లేఖన భాగాలనుండిన్నీ, 2 సమూ. 1 నుండిన్నీ మనలను బాధించిన ఉద్వేగాన్ని సంబాళించుకోడానికి నేను నాలుగు సలహాలు చెప్పగోరతాను.

## మూలాన్ని ఆలోచించు

## (1 సమూ. 24)

కొన్ని దినాల క్రిందట, నేను నా భార్య మరొక జంటను చూట్టానికి వెళ్లాం. నేనంటే యిష్టంలేని ఒకరు నా గూర్చి చేసిన ఒక వ్యాఖ్యానం ప్రస్తావించబడింది. ఆ రిమార్కు చేసిన విధానం కొంత నవ్వును పుట్టించింది. "దాని మూలాన్ని గూర్చి ఆలోచించు"మని ఒకరన్నారు; అప్పుడు ఎక్కువ క్షేమకరమైన అంశాలను చర్చించుకున్నాం.

నీవు పసివాడుగా ఉన్నప్పుడు, నీ గురించి నిర్దాక్షిణ్యంగా పలికిన మాటలను గూర్చి నీవు నీ తల్లిదండ్రులకు చెప్పినప్పుడు, "దాని మూలాన్ని గూర్చి ఆలోచించి - దాన్ని మరచిపొమ్మని" వారు నీకు చెప్పియుండవచ్చు. నీ గురించి నిర్దాక్షిణ్యమైన మాటలు ఎవరు చెప్పారో దాన్ని గూర్చి ఆలోచించితే, వాటిని పట్టించుకోనవసరం లేదనేది - వారి పాయింటు.

ఈ సూత్రాన్ని దావీదు పరిస్థితికి వర్తింపచేయి. అతని కష్టానికి మూలమేది? ఒక దిగజారిన, తనకు తానే శత్రువైన ఒక రాజు.[3]

పోయినసారి మనం మన కథను వదలినచోట, దావీదు అతని జనులు సౌలు సైన్యానికి చిక్కకుండ కొంచెంలో తప్పించుకున్నారు. ఫిలిష్తీయులతో యుద్ధం చేయడానికి రాజు తరలిపోయిన తరువాత, "దావీదు అక్కడనుండి పోయి ఏన్గెదీకి వచ్చి కొండ స్థలములలో నివాసము చేయుచుండెను" (1 సమూ. 23:29).

మృత సముద్రం యొక్క ఉత్తర తీరానికి మధ్య భాగంలో యెరూషలేముకు రమారమి ముప్పైయయిదు మైళ్లు ఆగ్నేయంగా ఏన్గెదీ ఉంది. ఆ చోటును సందర్శించినవారు దాని సౌందర్యాన్ని గూర్చి చెప్తూతారు. సముద్రానికి ఆరువందల అడుగుల ఎత్తులోనుండి అరణ్యంలోగుండా ప్రవాహపు ఊట జారుకుంటూ వస్తుంది. అయిదు జలపాతాలు, తేటైన నీటి కొలనులును, మిగుల శృంగారమైన ఆకులు, రంగు రంగుల పువ్వులలో అది అలంకరింపబడినట్టుంది. లోతుగా దిగిపోయే ఒయాసిస్ ఒకటి ఉంటుంది, గట్టిగా అడుగులు వేయగలిగినవాళ్లే దాన్ని చేరుకోగలరు. ఇక్కడ దావీదును అతని జనులును శారీరకంగానూ, మానసికంగానూ ఈ పరిస్థితులోనే ఉన్నారని చెప్పవచ్చు.

ఏదియెలాగున్నా, ఏన్గెదీ అనే ఈ ఆశ్రయంలో దావీదుకు కలిగిన "విశ్రాంతి, వినోద కాలక్షేపము" కొద్ది కాలమే కొనసాగింది. 24వ అధ్యాయం యిలా ఆరంభమౌతుంది: "సౌలు ఫిలిష్తీయులను తరుముట మాని తిరిగిరాగా దావీదు ఏన్గెదీ అరణ్యమందున్నాడని అతనికి వర్తమానము వచ్చెను. అప్పుడు సౌలు ఇశ్రాయేలీయులందరిలోనుండి మూడు

వేల మందిని వెంటబెట్టుకొని వచ్చి, కొండమేకలకు వాసములగు శిలాపర్వతములమీద దావీదును అతని జనులను వెదకుటకై బయలుదేరెను" (24:1, 2).

బైబిలు లేఖన భాగాల్లో ఎలాంటి దాపరికమూలేక మనను ఇరకాటంలో పెట్టేపరిస్థితి వస్తుంది: "మార్గముననున్న గొఱ్ఱెదొడ్లకు అతడు రాగా అక్కడ గుహ యొకటి కనబడెను. అందులో సౌలు శంకానివర్తికి (ఒంటికి) పోగా ..." (24:3ఎ). ఒరిజినల్ హెబ్రీలో "సౌలు తన కాళ్లను కప్పుకొనుటకు"[4] అని ఉంది. హెబ్రీలో అది ఒంటికిపోయాడనే భావం.

సౌలుకు తెలియనిదేమిటంటే – "దావీదును అతని జనులును ఆ గుహ లోపలి భాగములో ఉండిరి" (24:3బి)[5] అన్న సంగతి తెలియలేదు. సౌలు వస్తున్న సంగతి దావీదు విని, అక్కడున్న అనేక గుహలలో ఒక దాంట్లో తన వారిని దాచాలని నిర్ణయించుకొనియుండవచ్చు. (అక్కడ ఉన్న గుహలు దావీదుతో ఉన్న ఆరు వందలు కంటె ఎక్కువ మందిని దాచగలిగినంత పెద్దవి)

దావీదు జనులు "అదిగో – నీ దృష్టికి ఏది మంచిదో అది నీవు అతనికి చేయునట్లు నీ శత్రువుని నీ చేతికి అప్పగింతునని యెహోవా నీతో చెప్పిన దినము వచ్చెనని ..." వారు అతనితో గుసగుసలాడారు (24:4ఎ). యెహోవా వద్దనుండి వచ్చిన ఈ వాగ్దానం ఎక్కడుందో నేను చెప్పలేకపోతున్నాను. దేవుడు ఆ విషయం దావీదుకు తెలిపి ఉండవచ్చు, దాన్ని దావీదు తన మనుష్యులతో ప్రస్తావించి ఉండవచ్చు – కాని దావీదు సౌలును సంహరించడం దేవుని చిత్తమై ఉంటుందని వారు యిలా చెప్పే అవకాశం కూడా ఉంది. దేవుని నోట తమ మాటలు పలికించడానికి వారు మొదటివారూ కారు, కడపటివారూ కారు.

కొంచెంసేపు ఆగి పగతీర్చుకొనుటను గూర్చి కొన్ని వాస్తవాలను గమనించుదాం: (1) తమ్మును బాధించినవాడు భద్రత లేకుండా ఎప్పుడు దొరుకుతాడో అనే సమయం కొరకు పగతీర్చుకొనేవారు వెదకుతారు. ఆ గుహలో భద్రత లేనివాడు మరొకడెవడైనా ఉన్నాడని నేననుకోను. పగ తీర్చుకోవాలనే భౌతిక ఆలోచనలతో దావీదు యొక్క జనులు నడచారంటే ఆశ్చర్యపడను – వారు దీనిని దేవుడు అనుగ్రహించిన అవకాశంగా చూస్తున్నారు. (2) నీవు ఒకనిచేత బాధింపబడినట్టయితే, నీకు అవకాశం వచ్చినప్పుడు "సరిగా ఉపయోగించుకోమని" నీకు సన్నిహితులైనవారు ప్రోత్సహిస్తారు. అలా నీవు చేయడానికి, దావీదు జనులువలె వారు నీకు అనేకమైన మంచి కారణాలు సూచిస్తారు: "అతనికి పాఠం చెప్పాలి" అని; "అతని మందు యొక్క రుచి వానికే చూపాలి"; "అతన్ని అలా వదలితే నీకు గౌరవముండదు." దావీదు జనులువలె, వాళ్ళు దేవుని ప్రసక్తిని కూడ తెస్తారు: "నీకు దేవుడు కొన్ని హక్కులిచ్చాడు కదా" అని అంటారు. "చెప్పులో రాయిలా పడియుండాలని దేవుడు నిన్ను కోరడు" అని చెప్పవచ్చు కూడా!

ఇక్కడ కథ అనుకోని మలుపు తిరిగింది. 24:4 చివరి భాగం యిలా అంటుంది, "... దావీదు లేచి వచ్చి సౌలునకు తెలియకుండ అతని పైవస్త్రపు చెంగును కోసెను." దాన్ని కొంచెం యోచించి చూడు! అతని జనులు సౌలును చంపుమని కోరినప్పుడు, అతడు తన కత్తి తీసికొని చీకట్లో సౌలు వైపుకు వెళ్లాడు. రాజు హత్య చేయబడిన

అరుపుకో అతని గొంతును నరకిన కేకకు అతడు చచ్చాడు అన్న మాటను వినడానికో జనులు వేచియున్నారు – అయితే వారు అలాటిది ఏదీ వినలేదు. కొంత సేపటిలోనే దావీదు తిరిగి వచ్చాడు, కత్తి యింకా చేతిలోనే ఉంది, కాని దాని అంచున రక్తం లేదు. దావీదు ప్రశ్నల వర్షాన్ని ఎదుర్కొన్నాడు: "ఏమి జరిగింది?"; నీవేమి చేశావు?" వగైరాలు. దావీదు పళ్ళు కనిపించేటట్టు నవ్వి, సౌలు యొక్క రాజ వస్త్రంనుండి తాను తుంచిన చెంగును ఎత్తి చూపాడు.

అనేక ప్రశ్నలు మనకు కలుగుతాయి. "కనబడకుండ వినబడకుండ దావీదు సౌలుకు అంత సమీపంగా ఎలా వెళ్లగలిగాడు?" ఆ గుహలోనికి వచ్చినప్పుడు సౌలు తన పైవస్త్రమును తీసి ప్రక్కన ఉంచి ఉండవచ్చు. (నేనైతే అలా చేస్తా.) ఏదియెలాగున్నా, దావీదు అలా చేయడానికి చాలా ధైర్యంకావాలి. ముఖ్యమైన ప్రశ్నేమంటే – "దావీదు వస్త్రపు పైచెంగును మాత్రమే ఎందుకు కోశాడు?" సౌలును చంపే అవకాశం తనకున్నది కాని చంపలేదని సౌలుకు రుజువు చేయడానికి కావచ్చు (24:11). అన్నిటికంటే అతి ముఖ్యమైన ప్రశ్న ఏమంటే – "తనకు అవకాశం వచ్చినప్పుడు అతడు సౌలును ఎందుకు చంప లేదు." ఆ ప్రశ్నకు బదులివ్వడానికి, లేఖన భాగాన్ని చూద్దాం.

> సౌలు పైవస్త్రమును తాను కోసెనని దావీదు మనస్సు నొచ్చి – ఇతడు యెహోవాచేత అభిషేకము నొందినవాడు గనుక యెహోవాచేత అభిషిక్తుడైన నా ప్రభువునకు నేను ఈ కార్యము చేయను, యెహోవానుబట్టి అతని నేను చంపను అని తన జనులతో చెప్పెను (24:5, 6).

తాను చేసిన దాని గూర్చి దావీదు ఆలోచించినప్పుడు అతని అంతరాత్మ ఎందుకు బాధపడింది? సౌలుకు అతడు శారీరకంగా హాని చేయలేదు; అతడు రాజు వస్త్రపు చెంగును వంకరటింకరగా చేశాడు. అతడు చీకటిలోకి వెళ్లినప్పుడు సౌలు గొంతు కోయాలనే ఆలోచనతోనే వెళ్లాడు, కాని చివరి క్షణంలో అతడు మనస్సు మార్చుకొని, తన వస్త్రపు చెంగును కత్తిరించాడని కొందరు తలంచుతారు. దావీదు సౌలును తప్పక చంపాలని ఆలోచించడానికి అవకాశముంది. నన్ను చంపాలని ఒకడు మాటిమాటికి ప్రయత్నం చేస్తూ, నిస్సహాయ స్థితిలో అతడు నాకు అందినప్పుడు రేజర్ బ్లేడువంటి పదునైన కత్తి నా చేతిలో ఉంటే, "తటాలున నరికేస్తే నేను పరుగెత్తే దినాలు అంతరించి పోతాయ్" అనే ఆలోచన నాకు రాలేదు అంటే, నేను మానవత్వం కోల్పోయిన వాన్నైనా అవ్వాలి లేకపోతే మానవునికంటె అధికుడనైనా అవ్వాలి!

"సౌలు యొక్క వస్త్రపు చెంగును కోసినందుకే దావీదు యొక్క మనస్సాక్షి బాధపడిందని" లేఖనం తెలుపుతోంది. తాను చేసిన దానికి దావీదు యొక్క మనస్సాక్షి అతని నేరస్థుణ్ణి చేసింది, అతడు ఏమి చేయాలని తలంచాడు అనే దానికి కాదు. దావీదును గూర్చిన నా అభిప్రాయమేమంటే – అతడు బహు సాహసి (డేర్ డెవిల్), అపాయకరమైన వాటిలో ఉండే ఆనందాన్ని కోరుతాడు. నా ఊహేమంటే, వస్త్రపు చెంగును కోయడమనేది, రాజును ఇబ్బంది పెట్టడానికి చేసిన ఒక బడిపిల్లాడు చేసిన పని లాంటిది. అయినా, దాన్ని

గూర్చి అతడు ఆలోచించినప్పుడు, "దేవుని అభిషిక్తునికి భౌతికంగా హాని చేయకుండడం మాత్రమే కాదు, అతన్ని నీవు అన్ని విధాలా గౌరవించాలి" అని అతని మనస్సాక్షి అతనికి బోధించినట్టుంది.

మనం పఠిస్తున్న ఈ భాగంలో నేను చెప్పదలచుకున్న ముఖ్యాంశాన్ని ఇది తెలుపుతుంది: దావీదు సౌలును ఎందుకు చంపలేదు. అతడు తన జనులకు ఏమని చెప్పాడో గమనించు: "–ఇతడు యెహోవాచేత అభిషేకము నొందినవాడు గనుక యెహోవాచేత అభిషిక్తుడైన నా ప్రభువునకు నేను ఈ కార్యము చేయను, యెహోవానుబట్టి అతని నేను చంపను" (24:6). "యెహోవాచేత అభిషిక్తుడైనవాడు" అనే ప్రయోగాన్ని ముఖ్యంగా గమనించండి. దావీదు ఎలా అభిషేకింపబడ్డాడో అలాగే సమూయేలుచేత సౌలు కూడా నూనెతో అభిషేకింపబడ్డాడు (1 సమూ. 10:1; 16:13). "అభిషిక్తుడు" అనే దానికి హెబ్రీ పదం "మెస్సీయా" (దానికి గ్రీకు సమానం – "క్రీస్తు"). సౌలు గౌరవింప బడవలసిన సంగతి దావీదు ఎరుగు, అతడు ఎవడు అని కాదు (బలహీనుడు, అన్యాయస్తుడు, అవిధేయుడైన మనిషి), కాని అతడేమిటి: "దేవుని అభిషిక్తుడు" (మెస్సీయా)!

బైబిలులో మొదటనుండి బోధింపబడిన పాఠమది. పోలీసు నిన్నులాగుతున్నా అతనిని గౌరవించాలి – అతడెవరు అని కాదు (నీవంటి నరమాత్రుడే), –అతడు ఏమిటి అని తెలుసుకుని: "నీ మేలుకొరకు అతడు దేవుని పరిచారకుడై యున్నాడు" (రోమా 13:4). పెద్దలు వాళ్ళెవరు అన్న విషయాన్ని బట్టి గౌరవంపొందరు (మనుష్యులు అసాధారణమైన పనిని చేయాలని పూనుకుంటారు), "దేవుని సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ వారిని అధ్యక్షులుగా ఉంచాడు" (అపో. 20:28)[6] వాళ్ళెవరు అన్నదాన్ని బట్టి గౌరవించాలి.

దావీదు "మూలాన్ని ఆలోచించినప్పుడు," వెంటనే ప్రధానంగా ఇలాంటి నిర్ణయంలో దేవుని అభిషిక్తుడు గనుక అతనికి హాని కలిగించకూడదు! ఇలాంటి నిర్ణయంలో దావీదు రెండవ మైలు ఎలా వెళ్లాడో గమనించు: "ఈ మాటలు చెప్పి దావీదు తన జనులను అడ్డగించి సౌలుమీదికి పోనియ్యక వారిని ఆపెను" (24:7). దావీదు సౌలును చంపకపోవడం మాత్రమే కాదు; రాజును చంపకుండ తన జనులను ఆపడం కూడా జరిగింది. హెబ్రీలో దావీదు తన జనులను మాటలతో "ముక్కలుగా,"[7] "చింపివేసి" అని ఉందట. NIV – దావీదు తన జనులను "గద్దించెను" అని ఉన్నది. ఆ గుహ వెనుక వేడిగా చర్చలు గుసగుసలతో జరిగాయి. ఎవరి జీవితమైతే సౌలు యొక్క అణచివేత చట్టాలతో పాడయిందో, ఆలాటి తన జనులను సహా దావీదు అతి కష్టంమీద ఆపగలిగాడు.

ఒకని మీద పగ తీర్చుకోకుండా ఉండడమంటే, ప్రతీకారం చేయకుండా ఉండడం మాత్రమే గాక, ఆ వ్యక్తికి హాని చేయకుండ యితరులను ఆపడం కూడా. నేను ప్రసంగించిన ఒక స్థానిక సంఘములో, నేను రాజీనామా చేయవలసిన అవసరం వచ్చింది. నాకు చాలా బాధ కలిగింది. కాని నేను ఎవరికి తెలియకుండా శాంతంగా వెళ్లిపోవాలని అనుకున్నాను, కాని బయటకు కనిపించకుండా లోపల ఏదో దాగుందని స్థానిక సంఘంలో అనేకులు అనుమానించారు. అయినా, బయటికి కన్పించే దానికంటె యింకా ఎంతో ఎక్కువ అడుగున దాగియున్నట్టు స్థానిక సంఘంలో అనేకులు అనుమానించారు, వ్యక్తిగతమైన అక్కరలకంటే "ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుటకు" (ఎఫెసీ.

4:3) నీవు బాధింపబడినప్పుడు అలా జరిగించడం కష్టతరమని నేను గుర్తించాను! అయినా పగ తీర్చుకొనకుండడంలో అది అవసరమైన భాగం.

దావీదు తన జనులను ఆపినప్పుడు సౌలు గుహలోనే ఉన్నాడు. దావీదు ద్వారమువద్దకు వచ్చి కనిపెడుతున్నాడు. సౌలు కొంత దూరం వెళ్లిన తరువాత, దావీదు వెలుపలికి వచ్చి – “నా యేలినవాడా రాజా,” అని కేక వేశాడు (24:8).

మత్తయి 18లో, ఇతరులతో మనకుండవలసిన సంబంధాన్ని గూర్చిన శాశ్వత సూత్రాన్ని ప్రభువు యిలా నిలిపాడు: “మరియు నీ సహోదరుడు నీయెడల[8] తప్పిదము చేసిన యెడల నీవు పోయి, ... అతని గద్దించుము;[9] అతడు నీ మాట వినినయెడల నీ సహోదరుని సంపాదించు కొంటివి” (15వ.). కౌన్సిలింగ్‌లో దీనిని “ఎదుర్కోనడం” అని అంటాం. సంబంధాలను పునరుద్ధరించుకొనడానికి యిది అవసరమైన సూత్రం. తనలో కలిగిన ఉద్వేగాల వల్ల బాధపడుతున్న వ్యక్తికి సహాయం చేయవలసిన అవసరం కూడా ఉంటుంది. ఇప్పటివరకు, సౌలుకు ఎదురుగా వచ్చే అవకాశం దావీదుకు లేకుండానేపోయింది. ఏదియెలాగున్నా, చివరికి, అతడును, అతనిని బాధించినవాడును ముఖాముఖిగా ఎదురుపడ్డారు.[10]

సౌలు వెనుకకు తిరిగినప్పుడు, దావీదు సాష్టాంగపడి నమస్కారము చేసాడు: తరువాత ఉద్వేగరహితమైన ప్రసంగాన్ని చేసాడు:

> –దావీదు నీకు కీడుచేయ నుద్దేశించుచున్నాడని జనులు చెప్పిన మాటలు నీవెందుకు వినుచున్నావు? ఆలోచించుము; ఈ దినమున యెహోవా నిన్ను ఏలాగు గుహలో నా చేతికి అప్పగించెనో అది నీ కండ్లార చూచితివే; కొందరు నిన్ను చంపుమని నాతో చెప్పినను నేను నీయందు కనికరించి – ఇతడు యెహోవాచేత అభిషేకము నొందినవాడు గనుక నా యేలినవాని చంపనని నేను చెప్పితిని. నా తండ్రీ చూడుము, ఇదిగో, చూడుము. నిన్ను చంపక నీ వస్త్రపుచెంగు మాత్రమే కోసితిని గనుక నావలన నీకు కీడు ఎంతమాత్రము రాదనియు, నాలో తప్పిదము ఎంతమాత్రమును లేదనియు, నీవు తెలిసికొనవచ్చును. నీ విషయమై నేను ఏ పాపమును చేయనివాడనై యుండగా నీవు నా ప్రాణము తీయవలెనని నన్ను తరుముచున్నావు. నీకును నాకును మధ్య యెహోవా న్యాయము తీర్చును. యెహోవా నా విషయమై పగతీర్చునుగాని నేను నిన్ను చంపను (24:10–12).

ఈ ప్రసంగాన్నంతటిని నీవు చదవాలనుకోవచ్చు. దానిలో గమనించదగ్గ అనేక ప్రతిపాదనలున్నాయి. నిన్ను బాధించినవారిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో దావీదు ఓ చిన్న సెమినార్‌ను నిర్వహిస్తున్నాడు. దావీదు నీచంగా అసహ్యంగా ప్రవర్తించలేదు, తాను బాధింపబడ్డాడనే విషయం దాచనూ లేదు. అతని ప్రసంగం అదుపులో ఉంది, మర్యాదగా ఉంది; అతడు రాజును, “నా యేలినవాడు,” “యెహోవాచేత అభిషేకము పొందిన వాడు,” “నా తండ్రీ”[11] అని సంబోధించాడు. తన్ను గూర్చి తాను “చచ్చిన కుక్కను,” “మిన్నల్లిని” అని పోల్చుకున్నాడు. సౌలు చేసిన కార్యాలకు సాధ్యమైనంత శ్రేష్ఠమైన రూపాన్నిచ్చాడు; సౌలు, చేసిన కార్యాలకు వెనుకవున్న ఉద్దేశాలను తీర్పు తీర్చక, రాజు తప్పు ఆలోచనను వింటున్నారన్నాడు (24:9). సౌలు అర్థ రహితంగా

ఉన్నా, రాజుకు తాను ఏ విధమైన కీడు తలపెట్టలేదని రుజువును ప్రదర్శిస్తూ సంగతిని వివరించాడు.

నీవు ప్రత్యేకంగా గమనించాలని నేను కోరేది ఏమంటే–దావీదు "మూలాన్ని గూర్చి" ఆలోచించినపుడు, ఈ జరిగేవాటన్నిటికి అంతిమ మూలం దేవుడేనని అతడు చూచాడు. 24:10లో, దావీదు మాటలను గమనించు: "గుహలో యెహోవా నిన్ను నాచేతికి అప్పగించాడు." దావీదు అతనిని చంపునట్లు దేవుడు సౌలును దావీదు చేతికి అప్పగించాడని దావీదు సేవకులన్నారు. అయినా, యెహోవా రాజును తన చేతికి అప్పగించింది అతని విడిచిపెట్టి, తాను సౌలుకు శత్రువు కాడని రుజువు చేసికొన డానికేయని దావీదు భావించాడు.

ఒకరు నిన్ను బాధపరచినప్పుడు, నీవు "మూలాన్ని ఆలోచించి" ఆ పరిస్థితిలో దేవుడు నిన్ను మిక్కిలి పెద్దవానిగాను, శ్రేష్ఠుడువుగాను చేసే అవకాశమున్నదనే సంగతిని తోసివేయకు.[12]

దావీదు ప్రవర్తనకు సౌలు మనస్సులో ముగ్ధుడయ్యాడు.

> దావీదు ఈ మాటలు సౌలుతో మాటలాడి చాలింపగా సౌలు–దావీదా నాయనా, ఈ పలుకు నీదే అని బిగ్గరగా ఏడ్చి[13] దావీదుతో ఇట్లనెను – యెహోవా నన్ను నీచేతికి అప్పగింపగా నన్ను చంపక విడిచినందుకు ఈ దినమున నీవు నా అపకారమునకు ఉపకారము చేసినవాడవై, నా యెడల నీకున్న ఉపకార బుద్ధిని వెల్లడి చేసితివి గనుక నీవు నాకంటె నీతిపరుడవు … నిశ్చయముగా నీవు రాజువగుదువనియు, ఇశ్రాయేలీయుల రాజ్యము నీకు స్థిరపరచబడును (24:16, 17, 20).

దావీదు తన తరువాత రాజౌతాడని సౌలు బహిరంగంగా గుర్తించినది యిదే తొలిసారి.

వారిద్దరు కుదుటపడినట్టు అనిపిస్తుంది, కదా? దావీదు తిరిగి రాజధాని నగరుకు వచ్చి ఆ సంగతిని జ్ఞాపకంచేసి, రాజనగరియందు తన స్థానాన్ని ఆక్రమించవలసి యుండేదే. అయితే, కొంత సమయం మాత్రమే తన ఆధీనంలో ఉన్నట్టు దావీదుకు తెలుసు, ఎందుకంటే, చపలుడైన రాజు మాటను అతడు నమ్మలేకపోయాడు. ఆ అధ్యాయం ఈ మాటలతో ముగుస్తుంది: "అప్పుడు సౌలు ఇంటికి తిరిగి వచ్చెను; అయితే దావీదును అతని జనులును తమ కొండ స్థలములకు వెళ్లిపోయిరి" (24:22బి); వారెక్కడ నివసించు చుండిరో అక్కడే నివసించారు.

## వెలను లెక్కించు (1 సమూ. 25).

అధ్యాయం 25 సమస్యను కలిగిస్తుంది. 24, 26ల్లో దావీదు సౌలును సంహరించే సందర్భాలు ఏర్పడినా అతడు రాజును చంపలేదు. ఈ రెండు అధ్యాయాల మధ్య 25 ఇరుక్కుంది. అది ఒక భార్య భర్తను (నాబాలు అబిగయేలు) గూర్చియు, దావీదుతో వారికున్న సంబంధాన్ని గూర్చియు తెలుపుతోంది. ఒకే విధమైన సంఘటనలను గూర్చి

తెలిపే 24, 26 అధ్యాయాల మధ్యలో 25వ అధ్యాయం ఎందుకు ఉంచబడింది? అది అక్కడ ఉంచబడింది ఎందుకంటే, చారిత్రక కాలానుసారం అది వాటి మధ్య సంభవించింది గనుక అని మనం దానికి జవాబు యివ్వవచ్చు. అయినా చరిత్రకారులు గాని జీవిత చరిత్రను వ్రాసేవారుగాని తమ సమాచారాన్ని సరిగా ఎన్నుకుంటారు.[14] వారు ఆ సంగతులెందుకు ఎన్నుకున్నారో, అక్కడ ఎందుకుంచారో అన్నదానికి సరియైన కారణం ఉంటుంది.

24, 26 అధ్యాయాల మధ్యలో 25వ అధ్యాయం ఉండానికి కారణం: (1) పగ తీర్చుకొనడానికి సహజమైన యిష్టము ఉంది. మరియు (2) పగ తీర్చుకొనడమనేది ఒకని చేతిలోనికి తీసికొనుటలో దేవుని చిత్తమేమైయుందో నేర్చుకొనడానికి అది అక్కడ ఉంచబడిందని నేను నమ్ముతాను.

25వ అధ్యాయం యొక్క తొలి వచనం సమూయేలు మరణమును గూర్చియు, దావీదును అతని జనులును పారాను అరణ్యానికి మారిన దాని గూర్చియు తెలుపుతుంది. అరణ్యంలో దావీదు ఆరు వందల మంది సంగతి అటుంచు, ఆరుగురు మనుష్యులను సహితం పోషించలేడు. గనుక దావీదు, రక్షణ వ్యాపారంలో దిగాడు. దావీదును అతని జనులును బయట పొలాల్లో మేస్తున్న మందలను కాపాడారు (25:7, 8, 15, 16). "దావీదు రక్షణ వ్యాపారానికేగాని రక్షణలో అన్యాయపు విధానానికి కాదని నేను చెప్పాను గమనించు." "ప్రొటెక్షన్ రాకెట్" అంటే ఏమంటే – కాపుదల అవసరం లేని జనులను కాపాడతామని వచ్చే రౌడీ మూక. దానికి వ్యతిరేకంగా నిజంగా కాపాడవలసిన అవసరత పారాను అరణ్యంలో ఉంది. అక్కడ కంచెలుండవు; అడవి జంతువులు, మోటు జాతులవారు ఎక్కువగా ఉంటారు, గొర్రెలనుగాని, గొర్రె పిల్లలనుగాని ఎత్తుకొని పోవడం సహజంగా ఉంటుంది.

నాబాలు అనే ధనవంతుని మందలను దావీదు జనులు కాపాడుతున్నారు. "కర్మెలు లోని[15] మాయోనునందు ఆస్తిగలవాడొకడు కాపురముండెను. అతడు బహు భాగ్యవంతుడు,[16] అతనికి మూడువేల గొఱ్ఱెలును వెయ్యి మేకలును ఉండెను" (25:2). అయినా, అలాటి వ్యక్తిని ఒకడు తన పొరుగువానిగా ఉంచుకొనడానికి యిష్టపడడు. "చర్యలను బట్టి చూడగా నాబాలు మోటువాడును దుర్మార్గుడునై యుండెను" (25:3).[17] అతని గూర్చి అతని పనివారు యిలా అంటున్నారు, "మన యజమానుడు బహు పనికి మాలినవాడు,[18] ఎవనిని తనతో మాటలాడనీయడు" (25:17). అతనికి త్రాగుడు సమస్య కూడా ఉంది (25:36).

నాబాలు అనే అతని పేరుకు "బుద్ధిహీనుడు" అని అసలు అర్థం. తల్లి తన బిడ్డకు[19] "బుద్ధిహీనుడు" అనే పేరు పెట్టిందని ఊహించడమే కష్టంగా ఉంటుంది. అది అతని జన్మ నామానికి వక్ర రూపం అయ్యుంటుందేమో. ఒకవేళ అది హేళనగా పెట్టిన పేరేమో. ఏదియెలాగున్నా, అతనికి అతికించబడిన ఆ పేరుతో అతడున్నాడు. దానితోనే ప్రతివాడు అతన్ని పిలుస్తాడు, ఆఖరుకి తన భార్య సహితం ఆ పేరుతోనే అతన్ని పిలుస్తుంది (25:25). తన గుణానికి అది తగిపోయిందే.

25వ అధ్యాయంలోని డ్రామాలో మరో పాత్రధారి నాబాలు భార్య, ఆమె పేరు

అబీగయీలు. ఆమె పేరుకు అర్థం – "ఆమె తండ్రియొక్క సంతోషము." 2వ వచనం అటుంది: "ఈ స్త్రీ సుబుద్ధిగలదై రూపసియై యుండెను." ఎంత వింతైన కలయిక! బైబిల్లో నలుగురు స్త్రీలు మాత్రమే అందమైనవారు;[20] వారిలో ఒకతె అబీగయీలు.

బుద్ధిమంతురాలు రూపసియైన ఈమె బుద్ధిహీనుని ఎలా పెండ్లాడడం తటస్థించింది? జవాబేమంటే – దాని గూర్చి అబీగయీలు మాట్లాడడానికి వీలులేదు, వివాహాలు ఏర్పాటు చేయబడతాయి. ధనవంతుడైన నాబాలు దొరకడం గొప్పయని అబీగయీలు తల్లిదండ్రులు తలంచియుండవచ్చు. అబీగయీలు రూపసి గనుక నాబాలుకు అంగీకారంగానే ఉండియుంటుంది. ఆ విధంగా, అందగత్తె అడవి మృగం పెండ్లాడారు – అయితే అటు తరువాత వారు సంతోషంగా జీవించలేదు. అబీగయీలు అందమైన దుస్తులు ధరించుతూ, రమ్యమైన రథములమీద పయనించుతూ, ధారాళంగా విందులు చేస్తూ ఉంటుంది – అయితే వాస్తవమేమంటే ద్వేష భరితుడైన, త్రాగుబోతు బుద్ధిహీనునితో ఆమె వివాహం జరిగింది.

అధ్యాయం 25, గొర్రెల బొచ్చు కత్తిరించే సమయంగాను, పండుగ సందర్భంగాను ప్రారంభమౌతుంది (25:2). గొర్రెల బొచ్చు కత్తిరించే సమయంలో, ఉన్ని పంట సాధ్యం చేసినవారిని గొర్రెలను కాపాడినవారిని అభినందించడం ఆచారం. నాబాలు గొర్రె బొచ్చు కత్తిరించుచున్న సంగతి దావీదు విని, ఆ ధనవంతుని యొద్దకు తన పదిమంది జనులను పంపుతాడు. అతనితో వారు యిలా చెప్పాలి:

> –నీకును నీ యింటికిని నీకు కలిగిన అంతటికిని క్షేమమవును గాక అని పలికి యీ వర్తమానము తెలియజెప్పవలెను. –నీ యొద్ద గొఱ్ఱెబొచ్చు కత్తిరించు వారున్నారను సంగతి నాకు వినబడెను; నీ గొఱ్ఱెలకాపరులు మా దగ్గరనుండగా మేము వారికి ఏ కీడును చేసియుండలేదు; వారు కర్మెలులో నున్నంతకాలము వారేదియు పోగొట్టు కొనలేదు; ... కాబట్టి నా పనివారికి దయచూపుము. శుభదినమున మేము వచ్చితిమి గదా; నీ కిష్టము వచ్చినట్టు నీ దాసులకును నీ కుమారుడైన దావీదునకును ఇమ్ము (25:6–8).

దావీదు యొక్క యువకులు నాబాలునొద్దకు వెళ్లారు, వారు ఆ మాటలు పలికి "కూర్చున్నారు" (25:9). నీ లగేజిని నీ గదికి తీసికొని వచ్చి, అక్కడ నిలిచి యిచ్చే డబ్బు కొరకు ఎదురు చూచే కూలీలలా వారు నిలిచారు. దావీదు నాబాలుకు మధ్య ఎలాటి ఒడంబడిక లేదు సరిగదా, అతడు వారికి ఏమైనా యివ్వాలనే ఏ చట్టం లేదు – కనీసం లాంఛనంగా అయినా యివ్వాలనే ఏ రాతరూపమైన నియమం లేదు. ఏదియెలాగున్నా, నీవు ఏదైన ప్రత్యేకమైన సేవను పొందితే, నీవు నీ అభినందనను తెలుపడం నేడు ఎలా జరుగుతుందో ఆనాడు కూడా అలాగే జరుగుతుండేది. నాబాలు ఏమి యివ్వడానికి యిష్టపడినా, దావీదు జనులు దానికి అర్హులే. తరువాత గొర్రెల కాపరులు అబీగయీలుకు యిలా తెలిపారు:

> అయితే ఆ మనుష్యులు మా కెంతో ఉపకారము చేసియున్నారు. మేము పొలములో వారి మధ్యను సంచరించుచున్నంత సేపు అపాయము గాని నష్టము గాని మాకు

> సంభవింపనేలేదు. మేము గొఱ్ఱెలను కాయుచున్నంతసేపు వారు రాత్రింబగళ్లు మా చుట్టు ప్రాకారముగా ఉండిరి (25:15, 16).

అప్పుడు దావీదు సేవకులు తమ బహుమానం కొరకు వేచియున్నారు.

నాబాలు బుద్ధిహీనంగా ప్రవర్తించి, వారిని అవమానించడానికి ఆరంభించాడు:

> దావీదు ఎవడు? యెష్షయి కుమారుడెవడు? తమ యజమానులను విడిచి పారిపోయిన దాసులు ఇప్పుడు అనేకులున్నారు. నేను సంపాదించుకొనిన అన్నపానములను, నా గొఱ్ఱెలబొచ్చు కత్తిరించువారికొరకు నేను వధించిన పశుమాంసమును తీసి, నేను బొత్తిగా ఎరుగని వారికిత్తునా? (25:10, 11).

దావీదును గూర్చి తానెన్నడు వినలేదనియు, దావీదు సేవను గూర్చి తనకేమియు తెలియదనియు నాబాలు చెప్పాడు. ("నేనెరిగినంతవరకు అతడు తప్పించుకొని పారిపోయెడు ఒక బానిసయే") అయినా, దావీదు ఎవరో అబీగయీలు ఎరిగి ఉన్నందున (25:28, 30 లను పోల్చి చూడు). ఆమె భర్త కూడా ఎరిగే అవకాశముంది. నాబాలు కాపరులు, ఆ మనుష్యులు తమకు కాపుదలగా ఉన్న సంగతి తప్పక అతనికి తెలిపియుండవచ్చు. దావీదును ఎరుగకపోవడం అనేది నాబాలు సమస్య కాదు. అతడు కలిగినదాన్నంతా సొంతం చేసుకోవాలనే దురాశపరుడు.

వర్తమానికులు దావీదువద్దకు తిరిగి వచ్చారు. "ఆ మనుష్యులు తిరిగి వచ్చారు" అనే సెంట్రీ అరుపు నేను ఊహించగలను. వారిని చూసేందుకు ఆకలిగొన్న దావీదు వేచియున్నాడు. మంచి బలిసిన గొర్రె పిల్లను వండుకొనడానికి నిప్పు అతని వద్ద సిద్ధంగా ఉంది. అతని నోరు ఊరుతుంది. వారు వట్టిచేతులతో తిరిగి వచ్చారు. "ఏమయ్యింది?" అని దావీదు అడిగాడు. జరిగిన దానిని వారు తెలియజెసినప్పుడు, దావీదు కోపావేశుడై, "మీ ఖడ్గములను ధరించుడి!" అని బిగ్గరగా ఆ మనుష్యులతో చెప్పాడు.

> నాబాలునకు కలిగిన దాని అంతటిలో ఏదియు పోకుండ ఈ అరణ్యములో అతని ఆస్తి అంతయు నేను వ్యర్థముగా కాయుచు వచ్చితిని; ఉపకారమునకు నాకు అపకారము చేసియున్నాడే అని అనుకొని అతనికున్నవారిలో ఒక మగపిల్లవానినైనను[22] తెల్లవారునప్పటికి నేనుండనియ్యను; లేదా దేవుడు మరి గొప్ప అపాయమును దావీదు శత్రువులకు కలుగజేయు గాక అని ప్రమాణము చేసియుండెను (25:21, 22).

దావీదు ముఖము వెంటనే అతని వెంద్రుకలవలె ఎర్రగా మారిపోయింది, నాబాలు యింటివైపు ఆయుధ దారులైన తన నాలుగువందల మందితో బయలుదేరాడు!

నాబాలు ఏ చట్టాన్ని మీరలేదు, ఏ ఒడంబడికను రద్దుపరచలేదు. దావీదు ప్రాణానికి ఆపద కలిగించినవాడో, లేక అతని ప్రాణం తీయ చూచినవాడో కాదు. అతడు చేసినదంతా (1) దావీదును అవమానపరచడం మరియు (2) దావీదు సేవను అభినందించక పోవడమే. వెయిటర్‌కు టిప్ ఇవ్వకపోతే తుపాకితో అతడు పార్కింగ్ చోటుకినీ వెంటబడడాన్ని నీవు ఊహించగలవా? (నేను తగినంత టిప్ ఇవ్వలేదని కొన్ని సార్లు ప్రజలు నన్ను అవమానించడం నాకు తెలుసు, కాని నన్ను ఎవరూ చంపాలని ప్రయత్నించలేదు!)

ఏవిధంగా నీవు చూచినా, దావీదు అతిగా ప్రవర్తిస్తున్నాడు. నాలుగు వందల మంది జనులును (ప్లస్ దావీదు) నాబాలును అతని పనివారిని – బొద్దింకను తుపాకీ దెబ్బతో చంపబోతున్నట్టుంది! దీన్ని కూడా మనస్సులో ఉంచుకో, చంపడానికి తగిన ఏ తప్పిదము నాబాలు చేయనప్పటికిని, దావీదు ప్లాన్ చేసింది చంపడమే: ముందుగా ఆలోచించిన హత్య, మొదటి డిగ్రీ హత్య.

ఈ సమయంలో, అనేకమంది వ్యాఖ్యాన కర్తలు తమ తలలను ఊపుతారు. "ఇది నమ్మదగనిది! తన జీవితాన్నంతా దావీదును చంపడానికి ప్రయత్నించిన రాజు ప్రాణాన్ని వదిలిన దావీదు ఇతడే. కేవలం 'కృతజ్ఞతలను' చెప్పనందుకు ఒక అనామకుని చంపే పన్నాగంలో ఉన్నాడు! దావీదు యొక్క వ్యక్తిత్వంలోని ఈ మార్పును ఎవ్వరూ వివరించలేరు."అధ్యాయం 25లో దావీదు యొక్క సహజమైన రియాక్షన్ను మనం చూస్తామని నేననుకొంటున్నాను. సౌలు దేవుని అభిషిక్తుడై ఉండక పోయినట్లయితే,[23] సౌలుపట్ల తాను ఏమి చేయాలనుకునేవాడో, సౌలుకు ఏమి చేసేవాడో మనం చూసి యుండేవాళ్ళమేనని నా భావన. ఇంకా, తాను అనుభవించ వలసినదంతా అనుభవించ గలిగాడు, అవమానంతో పలికిన నాబాలు మాటలు అల్పమైనవే. అతడు యిలా ఆలోచించి ఉంటాడు, "నేను సౌలు అవమానాన్ని సహించాలి, నిష్ప్రయోజకుడైన వీని నుండి నేను దానిని పొందనవసరం లేదు!"

పగ తీర్చుకునే విషయంలో దావీదు ప్రత్యేకించి ఒక పాఠం నేర్చుకున్నాడు – దేవుని అభిషిక్తుని మీద పగ తీర్చుకోకూడదు – అతడెవ్వరైనాసరే చేతులారా పగతీర్చుకోకూడదని సాధారణమైన పాఠాన్ని దావీదు నేర్చుకో లేదు.

ఆ వధ కొరకు దావీదు తన మనుష్యులను సిద్ధం చేస్తూ ఉండగా, నాబాలు సేవకులలో ఒకడు దావీదు యొక్క సంకల్పాన్ని గూర్చి అబీగయీలుకు తెలియజేశాడు. ఏ స్త్రీ కోరుకొనని ఒక వివాహ బంధమందు అబీగయీలు బంధింపబడిందన్న విషయం మనస్సులో ఉంచుకో. అతి బుద్ధిహీనుడు భర్తగా ఉండడంకంటే జీవితంలో ఆమె ఇంకేమీ ఎక్కువగా ఎదురు చూడలేదు. ఆయుధ ధారులైన నాలుగు వందల మందితో దావీదు వస్తున్న సంగతి ఆమె విన్నప్పుడు, మిటకరించి చూచి, కొద్దిగా నవ్వి, "నేను నా గదిలోనికి వెళ్లి నా భర్తకొరకు ప్రార్థిస్తాను"[24] అని చెప్పడం సులభమే. ముప్పై నిమిషాలో లేక ఒక గంట తరువాత ఆమె బయటికి వచ్చియుంటే, అప్పటికి అంతా అయిపోయి ఉండేదే. కొన్ని నెలలపాటు దుఃఖపడినా, ఆ ప్రాంతంలో బహు ఐశ్వర్యంగల విధవరాలుగా నిలిచిపోయేదే – అందుకు ఆమెను ఎవరూ నిదించియుండేవారు కాదు.

ఆమె అలా ప్రత్యుత్తరం యివ్వ లేదు. తన భర్త యొక్క ప్రాణాన్ని కాపాడడానికి ఆలోచించింది. ఆ ప్రకారం తన ప్రాణాన్నే ఆమె యిక్కట్టులో పెట్టుకోవలసి వస్తుంది, అయితే అది ఆమె చేయ బూనుకుంది ఎందుకు? ఎందుకంటే, నాబాలును[25] పెండ్లాడినప్పుడు దేవుని సమక్షంలో ఆమె అతనితో ముడిపెట్టుకుంది. అతడు మోటువాడే కావచ్చు, తిట్టుబోతే కావచ్చు, విసుగు పెట్టేవాడే కావచ్చు – అయినా అతడు ఆమె భర్త జీవితాంతంవరకు అతడు వివాహం చేసుకున్న భర్త. వివాహబంధాన్నిట్టే తీసిపారేసే ఈ రోజుల్లో, అబీగయీలు లాంటి స్వభావం కలిగియుండడం ఎంత అవసరం!

"విడాకులను నేను ద్వేషిస్తున్నా"నని దేవుడు యింకా అంటునే ఉన్నాడు (మలాకీ 2:16), మరియు "దేవుడు జతపరచినదానిని మనుష్యులు వేరు చేయకూడదని" క్రీస్తు ప్రభువు యింకా అంటునే ఉన్నాడు (మత్తయి 19:6).

అబీగయీలు తన ప్లానును వెంటనే అమలు చేసింది. తన వంట గదిలోను, సామాన్లగదిలోనూ ఉన్న ఆహారన్నంతా ఆకలిగొనియున్న నాలుగు వందల ఒక్క మనిషి కోసం బయటికి తీసింది. అంతా గాడిదల మీద వేసికొంది, దావీదును కనుగొనడానికి బయలుదేరింది – వధించాలన్న భావంతో వచ్చిన సైనికులందరినీ ఒక్క స్త్రీ ఎదుర్కోడానికి వెళ్తోంది.[26]

దావీదును అతని సైన్యాన్నీ ఆమె ఒక లోయవద్ద కలుసుకుంది. ఆమెను చూసిన దావీదు ఆశ్చర్యపడి కవాతు చేస్తున్న సైనికుల్ని ఆపి ఉంటాడని నేను అనుకుంటాను. అబీగయీలు దావీదు ఎదుట మోకరించి, లేఖనాల్లో కన్పించే ఒక అమోఘమైన విన్నపాన్ని చేసింది. (తన భర్త పక్షంగా ఆమె క్షమాపణ చెప్పుకుంది. ఇది మొదటి సారి కాదని నేను అనుమానిస్తున్నా; ఈలాటి సంభాషణను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఆమె యిచ్చి యుండవచ్చు!)

అబీగయీలు తన మాటల్లో, జరిగిన అపార్థానికి ఆమె సంపూర్ణమైన బాధ్యత నంగీకరించింది (25:24; 25:28ని కూడా చూడు). దావీదు ఏర్పాటును అది చెదర గొట్టింది. బుద్ధిహీనుడైన నాబాలును చంపడం ఒక వంతు; సుందరియైన స్త్రీని చంపడం మరో వంతు.[27] తాను తెచ్చిన కానుకను స్వీకరించుమని ఆమె దావీదును అర్థించింది (25:27). తన మాటల్లో గొప్ప మర్యాదను కనుపరచింది. ("నా యేలిన వాడా" అని దావీదును పన్నెండు సార్లు సంబోధించింది, "నీ దాసురాలు" అని తన్ను గూర్చి ఆరు సార్లు చెప్పుకుంది!) దేవుడు దావీదుతో ఉంటాడని తన నమ్మికను వ్యక్తపరచింది (25:28-31).[28] మరోకని కోపాన్ని చెదరగొట్టాలనుకున్న ఆమె మాటలు మాదిరిగా ఉన్నాయి.

అబీగయీలు చేసిన దానిలో ముఖ్యమైనదేమంటే, కోప పూరితుడైన ఆ మనిషి చేయబూనిన దాని పర్యవసానం ఏమౌతుందో ఆలోచించడానికి అవసరమైనంత వరకూ అతని వేగాన్ని తగ్గించింది.

> "... ప్రాణహాని చేయకుండ యెహోవా నిన్ను ఆపియున్నాడు ... నీ శత్రువులును నా యేలినవాడవైన నీకు కీడు చేయ నుద్దేశించు వారును నాబాలువలె ఉందురు గాక. యెహోవా నా యేలినవాడవగు నిన్ను గూర్చి సెలవిచ్చిన మేలంతటిని నీకు చేసి నిన్ను ఇశ్రాయేలీయులమీద[29] అధిపతినిగా నిర్ణయించిన తరువాత నా యేలినవాడవగు నీవు రక్తమును నిష్కారణముగా చిందించినందుకేగాని ... పగ తీర్చుకొనినందుకేగాని, మనో విచారమైనను దుఃఖమైనను ... నీకు కలుగక పోవును గాక ..." (25:26, 30, 31).

"దేవుడు నిన్ను రాజుగా చేస్తాడు," "అలాగు జరిగినప్పుడు నీ రికార్డులోగాని, నీ మనస్సాక్షిలో గాని నిష్కారణంగా జనులను చంపినట్టున్నూ, న్యాయం నీ చేతిలోనికి తీసికొనినట్టున్నూ ఉండకుండును" గాక అని అబీగయీలు చెప్పింది.

దావీదు ప్రత్యుత్తరము, "దేవుని హృదయానుసారుడని" పిలువబడడానికి గల ఒక

కారణాన్ని చూపుతోంది. అతనికి బోధింపబడే తత్వముంది; అతనికి సమీపించగల తత్వముంది.[30] "అందుకు దావీదు – నాకు ఎదురు పడుటకై నిన్ను పంపిన ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు స్తోత్రము కలుగును గాక. నేను పగ తీర్చుకొనకుండను ఈ దినమున ప్రాణము తీయకుండను నన్ను ఆపినందుకై నీవు ఆశీర్వాదము నొందుదువు గాక. నీవు చూపిన బుద్ధి విషయమై నీకు ఆశీర్వాదము కలుగును" (25:32, 33). దుడుకుతనంతో ఉన్న దావీదు రాజుకు కావలసిన విలువైన పాఠాలను నేర్చుకొంటున్నాడు: హింస మరి యెక్కువైన హింసను పుట్టిస్తుంది; మరోవైపు, నిగ్రహము సమాధానకరమైన పరిష్కారాలను తెస్తుంది.

"వాని మూఢతచొప్పున మూర్ఖునికి ప్రత్యుత్తర మియ్యకుము. ఇచ్చినయెడల నీవును వాని పోలియుందువు" అని జ్ఞానియైన సొలొమోను అన్నాడు (సామె. 26:4). ఆ సామెత అతడు తన తండ్రియైన దావీదు దగ్గర నేర్చుకొని ఉండవచ్చు. ఎందుకంటే, దావీదు బుద్ధిహీనుడికి జవాబుగా బుద్ధిహీనమైన పనిని చేయబోయాడు.

సమానంగా బదులివ్వడంవలన నీవు ముందుకు పోలేవు అని అంటారు. సామాన్యంగా ప్రతికూలం కావించాలని చేసే మన ప్రయత్నాలు మన మీదనే ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. వాళ్లకంటె మననే ఎక్కువగ బాధిస్తాయి. నేనొకసారి కారు డీలర్ ఒకడు ఆన్యాయం చేసాడని అనుకున్నాను "వాడికి తగిన బుద్ధిచెప్పాలి అను కున్నాను" నేనతనితో ఇక ఏ వ్యవహారం చేయను అనుకున్నాను, కాని మేం ఉంటున్న ఈ చిన్న బస్తీలో, ఆ డీలర్ ఒక్కడు మాత్రమే నా కారు మీదున్న పూచీని అంగీకరిస్తాడు. వ్యవహారం చేయకపోతే అతనికి పెద్దగా పోయిందేమీలేదు. కాని నా కారును మాత్రం దారుణంగా పోగొట్టుకుంటాను.

ఈసారి నీవెవరి మీదనైనా కోపగించుకో దలచుకొంటే (పది, ఇరవై, నూరు లేక చల్లబడడానికి ఎన్ని సార్లు అవసరమో అన్నిటిని లెక్కించు), తరువాత పగ తీర్చుకోడంలో – నీ గౌరవానికి, నీ మానసిక నెమ్మదికి, నీ ఆత్మకు ఎంత ఎక్కువ వెలకడుతుందో లెక్కించు.

అధ్యాయం 25లోనున్న కథను త్వరగా ముగించారు. అబీగయీలు యింటికి తిరిగి వచ్చిన తరువాత, ఏమి జరిగిందో నాబాలుకు చెప్పలేకపోయింది. ఎందుకంటే అతడు మత్తుడైయున్నాడు (25:36)[31] మర్నాడు అతడు తేరుకున్నప్పుడు ఆమె విషయాన్ని చెప్పింది. వెంటనే అతనికి పోటు వచ్చింది.[32] కొన్ని దినాల తరువాత అతడు మరణించాడు.[33] దాని గూర్చి దావీదు విన్నప్పుడు, అతడిలా అన్నాడు, "–యెహోవా నాబాలు చేసిన కీడును అతని తలమీదికీ తెచ్చాడు గనుక తన దాసుడనైన నేను కీడు చేయకుండ నన్ను కాపాడి, నాబాలువలన నేను పొందిన అవమానమును తీర్చిన యెహోవాకు స్తోత్రము కలుగును గాక" (25:39).

దావీదు అబీగయీలు బుద్ధి, అందముచేత ఒప్పింపబడినవాడై, ఆమెను వివాహం చేసికొంటాననే ప్రస్తావనను తన సేవకుల ద్వారా పంపాడు.[34] వారిద్దరు భార్యభర్తలయ్యారు. మంచి భోజనం కావాలనే దావీదు కోరికతో కథ ఆరంభమై, మంచి భార్యను పొందడంతో అంతమౌతుంది.[35]

ఆ దినాన దావీదు కొన్ని విలువైన పాఠాలను నేర్చుకున్నాడు. మొదటిది, వ్యక్తిగతంగా పగ తీర్చుకొనడం మంచిది కాదు. రెండవది, పగతీర్చుకొనడమనేది దేవుని చేతిలో విడిచిపెట్టినట్టయితే, ఆయన సమస్తాన్ని మేలుగా ఉండేలా తీర్చి దిద్దుతాడు. ఈ పాఠాలు మనమందరం నేర్చుకోవాలి.

## యెహోవా చేతిలో దాని పెట్టుము

## (1 సమూ. 26)

అబీగయీలునుండి దావీదు పాఠం నేర్చుకొని ఎక్కువ కాలం కాలేదు. అతడు మరో మారు జీఫీయులచే మోసపరచబడ్డాడు (26:1), సౌలు తిరిగి కొట్టగలిగినంత సమీపానికి చేరుకున్నాడు.[36] జీఫీయులు దావీదును కడసారిగా చూచిన హకీలా[37] కొండవద్ద సౌలు తన సైన్యంతో దిగాడు. సౌలు తిరిగి ఆ ఏరియాకు వచ్చిన సంగతిని గూర్చి దావీదు విన్నప్పుడు, సౌలు తన మాట మీద నిలువలేకపోయాడన్న సంగతిని అతడు నమ్మలేకపోయాడు. గూఢాచారులు ఆ సమాచారాన్ని స్థిరపరచారు, కాని దావీదు దాన్ని చూడాలని తానే వెళ్లాడు.

దావీదును, అతని జనులలో కొందరు అక్కడికి చేరేటప్పటికి రాత్రయ్యింది.[38] అయితే ప్రక్కనున్న కొండనుండి, చంద్రకాంతిలో సౌలు ఎక్కడ నిద్రిస్తున్నది దావీదు చూడగలిగాడు. సౌలుకు తాను ఏ హానీ తలపెట్టలేదనే సమాచారాన్ని రుజువు చేయడానికి అతడు ఒక అపాయకరమైన ప్రయత్నం చేయ తీర్మానించుకున్నాడు. అప్పుడు దావీదు – "పాళెములోనికి సౌలు దగ్గరకు నాతో కూడ ఎవరు వత్తురని" అడుగగా, "నీతోకూడ నేను వత్తునని అబీషై"[39] అన్నాడు (26:6).

దావీదు అబీషైలు పాకుకుంటూ వస్తూ ఉండగా, అక్కడ కాపలాదార్లు ఎవరు లేక పోవడం చూచి ఆశ్చర్యపడ్డారు. సౌలు సైన్యంలో ఉన్నవారికందరికి యెహోవాచేత గాఢ నిద్ర కలిగించబడినట్టు 12వ వచనం సూచిస్తుంది. ఆ పాళెములోని మధ్యకు వచ్చేవరకు జనులను వారు దాటుకొంటూ వచ్చారు. సౌలు అక్కడ నిద్రిస్తున్నాడు. అతని తలవద్ద శూలము నాటుకుని ఉంది.[40] గుహలో జరిగినట్టే, సౌలును చంపడానికి దేవుడు అతనికి ప్రసాదించిన అవకాశమని అబీషై అనుకుంటున్నాడు (26:8). అతడు దేవుని అభిషిక్తుడైన కారణాన, సౌలును చంపనని దావీదు మరోసారి అన్నాడు (26:9; 26:11లను కూడా చూడు).

ఈసారి దావీదుకు నాబాలు, అబీగయీలు వద్ద అతడు నేర్చుకున్నట్టుగా, పగతీర్చుకొనడాన్ని దేవుని చేతులకు అప్పగించాలి అనే ఆలోచన తోడైంది.[41] "యెహోవా జీవముతోడు యెహోవాయే అతని మొత్తును, అతడు అపాయమువలన చచ్చును, లేదా యుద్ధమునకు పోయి నశించును" అని దావీదు అన్నాడు (26:10). మరోవిధంగా చెప్పాలంటే, సౌలు నాబాలు చచ్చినట్టయినా చస్తాడు, దేవునిచే మొత్తబడిన వాడై "సహజమైన" మరణం పొందుతాడు – లేదా యుద్ధంలోనైనా చస్తాడు. అయితే ఒక సంగతి మాత్రం నిశ్చయం: చివరిలో దేవుడు అప్పులన్నిటిని సర్దేస్తాడు. (నెరవేరినప్పుడు,

రెండవ అవకాశం నిజమయ్యింది: సౌలు యుద్ధంలో చచ్చాడు.)

"అతని తలగడ దగ్గరనున్న యీటెను నీళ్ల బుడ్డిని తీసికొని మనము వెళ్లిపోదము రమ్మని" దావీదు అబీషైతో చెప్పాడు (26:11). వారి శిబిరములోనుండి, మెల్లగా కొండదిగి, లోయను దాటి, దాని చేరువనున్న పర్వత శిఖరానికి చేరుకున్నారు. రాజును కాపాడడానికి గాను అతని ప్రక్కన పండుకొనియున్న అబ్నేరును[42] దావీదు అక్కడనుండి పిలిచాడు: "... ఇశ్రాయేలీయులలో నీ వంటివాడెవడు?[43] నీకు యజమానుడగు రాజునకు నీవెందుకు కాపు కాయక పోతివి? నీకు యజమానుడగు రాజును సంహరించుటకు జనులలో ఒకడు చేరువకు వచ్చెనే" (26:15, 16) అని అడిగాడు. సౌలు యొక్క సైన్యం కంటెను తానే రాజునకు శ్రేష్ఠమైన స్నేహితుడు. ఎందుకంటే, రాజును చంపకుండ అబీషైని ఆపింది అబ్నేరు కాదు, సైన్యం కాదు, తానే అని దావీదు చెప్పదలచుకున్నాడు.

సౌలు దావీదు స్వరాన్ని గుర్తుపట్టి – దావీదా నాయనా, ఇది నీ స్వరమే గదా? అని అడిగాడు (26:17). అందుకు తన వద్దనున్న ఈటెను నీళ్ల పాత్రను రుజువుగా చూపుతూ, తాను నిర్దోషియని మనస్సులో నాటేలా దావీదు మరొక మాటను తాను అతనికి శత్రువును కానని చెప్పాడు. అతడు యిలా అన్నాడు:

> రాజా నా యేలినవాడా, నీ దాసుని మాటలు వినుము. నామీద పడవలెనని యెహోవా నిన్ను ప్రేరేపించినయెడల[44] నైవేద్యము చేసి ఆయనను శాంతిపరచవచ్చును. అయితే నరులెవరైనను నిన్ను ప్రేరేపించిన యెడల[45] వారు యెహోవా దృష్టికి శాపగ్రస్తులగుదురు. వారు–నీవు దేశమును విడిచి అన్యదేవతలను పూజించుమని నాతో చెప్పి, యెహోవా స్వాస్థ్యమునకు హత్తుకొనకుండ నన్ను వెలివేయుచున్నారు. నా దేశమునకు దూరము గాను, యెహోవా సన్నిధికి ఎడముగాను నేను మరణము నొందక పోవుదును గాక ... (26:19, 20).[46]

పారిపోయేవాడుగా ఉండడం దావీదుకు అంత పట్టింపుగా లేదు, దేవుని ఆరాధించ డానికి తక్కిన జనులతో తాను దేవుని మందిరానికి పోలేకున్నానే అనేది అతని అసలైన అక్కర! తక్కిన సోదర సోదరీలతో కూడకపోవడానికి సాకులు వెదకే మనలా కాకుండ, "–యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించి తిని" అనేది దావీదు యొక్క తత్వం (కీర్తన. 122:1). వెళ్ళలేనప్పుడు విచారించేవాడు.

మనస్సును కదిలించే దావీదు సంభాషణలో, అబీగయీలు నుండి నేర్చుకున్న పాఠాన్ని కూడా అతడు ప్రస్తావించాడు: "ఆయన (యెహోవా) నా నీతిని నా విశ్వాస్యతను చూచి నాకు ప్రతిఫలము దయచేయును" (26:23).

మరల సౌలు హృదయానికి తాకింది "అందుకు సౌలు–నేను పాపముచేసితిని,[47] ... వెర్రివాడనై నేను బహుగా తప్పు చేసితిని" అని, "నేను నీకిక కీడు చేయను," "నాయెద్దకు తిరిగి రమ్మని" అతడు దావీదును వేడుకున్నాడు (26:21). దావీదును అతడు "కుమారుడా" అని పిలుస్తున్నాడు కాని, ఇంతకు ముందులా దావీదు సౌలును "నా తండ్రీ" అని సంబోధించ లేదు.[48] తన భార్యయైన మీకాలును సౌలు వేరొకనికి[49] యిచ్చిన

సంగతి దావీదుకు తెలుసు. సౌలు అతనికి యిక మామ కాదు, సౌలు యింటిలో అతనికి స్థానంలేదు. దావీదు అతని వద్దకు వచ్చుటకు తయారు కాలేదు, గనుక దావీదు "తన మార్గాన వెళ్లిపోయాడు, సౌలు తన స్థలానికి తిరిగి వచ్చాడు" (26:25).

పగ తీర్చుకొనుటను గూర్చి దావీదు నేర్చుకున్నన్ని ముఖ్యమైన పాఠాలు మరెవ్వరు నేర్చుకోలేరు: "దానిని యెహోవా చేతికి అప్పగించు" అనేది ఆ సందేశ సారము. ఈ ప్రాముఖ్యమైన సత్యము పాత, క్రొత్త నిబంధనల రెండింటిలో బోధించబడింది: ద్వితీయో. 32:35, 36; హెబ్రీ. 10:30; బలమైన ఈ సత్యం క్రీస్తు ప్రభువు యొక్క జీవితంలో కన్పిస్తుంది. పేతురు యిలా వ్రాశాడు:

> క్రీస్తుకూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను (1 పేతురు 2:21–23).

పగతీర్చుకొనడాన్ని క్రీస్తు ప్రభువు "దేవునికి అప్పగించారు" – పైగా ఆయన మనకు మాదిరి ఉంచిపోయారని పేతురు తెలియజేశాడు.

రోమా 12లో పౌలు ఒక సవాలును ప్రతిధ్వనింపజేశాడు. 17వ వచనంలో అపొస్తలుడైన పౌలు యిలా అన్నాడు, "కీడుకు ప్రతి కీడెవనికిని చేయవద్దు." నేను దాన్ని వ్రాయలేదు. నేనే ఒకవేళ వ్రాసియున్నట్టయితే, "కీడుకు ప్రతికీడు ఎక్కువగా చేయ వద్దులే" ఎప్పుడే కాని "కీడుకు ప్రతికీడు ఎవ్వరికీ చేయవద్దు" అని అనియుండే వాడను. కాని పౌలు చెప్పిందేమంటే, "కీడుకు ప్రతికీడు" ఎవనికిని ఎన్నడు చేయవద్దు అని. ఆ తరువాత యిలా కొనసాగించాడు, "శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి – పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది" (26:18, 19). "దుష్టత్వము శిక్షింపబడకుండ పోతుందని" లేఖన భాగం చెప్పడం లేదు. ఇతరులను బాధించినవారు, "వారికి రావలసిన దానిని పొందుతారు," కాని దానిని ఇచ్చేవాళ్ళం మనమై యుండరాదని ఈ లేఖనం నొక్కి చెప్తుతుంది. అది దేవుని పరిధి, మనది కాదు. దానిని దేవుని చేతికి అప్పగించుదాం.

## క్షమించి, మరచిపో (2 సమూ. 1)

మనము పాఠము ముగింపుకు వస్తూ ఉండగా దావీదును అతని జనులును ఫిలిష్తీయుల మధ్య జీవించిన కాలాన్ని వదలి, సౌలుతో దావీదుకున్న బాంధవ్యంలోఉన్న సూత్రాలను గుర్తించుదాం. "క్షమించి, మరచిపో" అని చెప్పడం సులభమే గాని, జీవించడం కష్టం.

1 సమూ. 31లో, సౌలు తన ఖడ్గంమీదపడి ఆత్మహత్య చేసికొన్న సంగతిని

చదువుతాం (4 వ.). 2 సమూ. 1లో దావీదు, రాజు యొక్క మరణాన్ని గూర్చి తెలిసు కొంటాడు. దావీదు చాలా ఆనందించి, తన్ను లయపరచడానికి ప్రయత్నించిన వానిని అవమానం చేయడానికి సమయం అనుకూలించేదే. దానికి బదులు, దావీదు విలపించి, అతని గౌరవార్థం ఒక రమ్యమైన కావ్యాన్ని వ్రాశాడు. తన స్నేహితుడైన యోనాతాను పట్ల దావీదుకున్న ప్రేమను కావ్యరూపంలో ఉంచాడన్న విషయం గత పాఠంలో మనం గుర్తించాం. ఏదియెలాగున్నా, "యెహోవా అభిషిక్తునిగా" సౌలు పేరు పద్యంలో తొలిగా ప్రత్యక్షమౌతున్నదన్న వాస్తవాన్ని వదలకూడదు, మరియు రాజును గూర్చి అనేక శ్లాఘ్య వచనాలు చెప్పబడ్డాయి.

> … దావీదు సౌలును గూర్చియు అతని కుమారుడైన యోనాతానును గూర్చియు ధనుర్గీతమొకటి చేసి దానినిబట్టి విలాపము సలిపెను,[50]…
>
> ఇశ్రాయేలూ, నీకు భూషణమగువారు
> నీ ఉన్నత స్థలములమీద హతులైరి.
> ఆహహా బలాఢ్యులు పడిపోయిరి.
> ఫిలిష్తీయుల కుమార్తెలు సంతోషింపకుండునట్లు
> సున్నతిలేనివారి కుమార్తెలు జయమని చెప్పకుండునట్లు
> ఈ సమాచారము గాతులో తెలియజేయకుడి
> అష్కెలోను[51] వీధులలో ప్రకటన చేయకుడి.
> గిల్బోవ[52] పర్వతములారా
> మీమీద మంచైనను వర్షమైనను
> ప్రథమ ఫలార్పణకు తగిన పైరుగల చేలైనను
> లేకపోవును గాక.
>
> బలాఢ్యులడాళ్లు అవమానముగ పారవేయబడెను.
> తైలముచేత[53] అభిషేకింపబడని వారిదైనట్టు
> సౌలు డాలును పారవేయబడెను.
>
> హతుల రక్తము ఒలికింపకుండ
> బలాఢ్యుల క్రొవ్వును పట్టకుండ
> యోనాతాను విల్లు వెనుకతియ్యలేదు
> ఎవరిని హతము చేయకుండ సౌలు కత్తి వెనుకకు తీసినది కాదు.
>
> సౌలును యోనాతానును తమ బ్రతుకునందు
> సరసులుగాను నెనరుగల వారుగాను ఉండిరి.
> తమ మరణమందైనను వారు ఒకరినొకరు ఎడబాసినవారు కారు
> వారు పక్షిరాజులకంటె వడిగలవారు
> సింహముకంటె బలముగలవారు.
> ఇశ్రాయేలీయుల కుమార్తెలారా, సౌలునుగూర్చి ఏడ్వుడి.
> అతడు మీకు ఇంపైన రక్తవర్ణపు వస్త్రములు ధరింపజేసినవాడు
> బంగారు నగలు మీకు పెట్టినవాడు …[54]
> అయ్యయ్యో బలాఢ్యులు పడిపోయిరి
> యుద్ధ సన్నద్ధులు[55] నశించిపోయిరి (2 సమూ. 1:17, 19-24, 27).

కొన్ని సార్లు సమాధి కార్యక్రమమువద్ద, సరిగా జీవితం గడపనివాణ్ణి కూడా[56] ప్రశంసిస్తారు – వాళ్ళువంచకుల సమూహం కదా! సౌలును ప్రశంసించినప్పుడు, దావీదు అబద్ధమాడుతున్నాడా లేక వేషధారివలె ఉన్నాడా? లేదు. సౌలును గూర్చి చెప్పబడిన ప్రతిదీ నిజమే. చెడ్డవాటిని కాకుండ, దావీదు అతని మంచి లక్షణాలను ఏరుకున్నాడు. దావీదు విశ్వాసరహితుడు కాదు; కాని తనకున్న స్వేచ్ఛలో బహు శ్రేష్ఠమైన దానిని అతడు కోరుకున్నాడు. అదేమంటే, "క్షమించి, మరచిపో."

"పగ తీర్చుకొనడం మధురంగా ఉంటుంది"[57] అనే విలియం పెయింటర్ చేసిన తీర్మానాన్ని లోకం అంగీకరిస్తుంది. అయినా, పగతీర్చుకొనడంకంటెను మధురమయ్యింది ఉంది. బాధింపబడడం, బాధ అనుభవించడం అనేవాటికి మించి, క్షమించడం ... "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు"మని ప్రభువులా ప్రార్థించడం, ఆయనలా జీవించడం (లూకా 23:34). మనం క్షమింపబడునట్టు క్షమించడం (మత్తయి 6:14, 15) అనేవి ఉన్నాయి.

ఈ సలహాయివ్వడంలో, మనం ఎరిగిన ప్రయోగం "క్షమించి, మరచిపో" అనే దాన్ని ఉపయోగిస్తున్నాను. మరచిపోవడం అనేది – చేయబడిన గాయం మన మనస్సుల్లో నుండి సంపూర్ణంగా తుడిచివేయబడేలా మనలో ఎవరూ చేయలేరు. దేవుడు "మరచి పోయినట్టు"[58] మనం మరచిపోగలం: క్షమించినవారి మీద ఏవిధమైన హాని చేయకుండేలా చూస్తాం. అది మరల జ్ఞాపకం చేసికొకుండేలా చూస్తాం. సౌలును గూర్చి విలపించడంలో దావీదు చేస్తుంది యిదే.

హాప్‌కిన్స్‌విల్లీ, టెనెసీలోని లిటిల్ రివర్ క్రీస్తు సంఘ సభ్యులైయున్న ఫ్రాంక్ మరియు ఎలిసబెత్ మోరిస్ అనేవారు కఠిన మార్గంలో వారు క్షమాపణలోని మాధుర్యాన్ని నేర్చుకున్నారు. 1982 క్రిస్టమస్‌కు కొంచెం ముందుగా, డేవిడ్ లిప్స్ కోంబ్ కాలేజీ విద్యార్థిగానున్న వారి కుమారుడైన టెడ్, త్రాగి కారు నడుపుతున్న వాడిచేత చంపబడ్డాడు. హృదయం పగిలిపోయిన మోరిసులు తమ కుమారుని చంపినవానికి మరణ శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. టామీ పిగాగేకి నరహత్య క్రింద శిక్ష తగ్గించబడింది. మోరిస్సెస్ కక్షతో దహించుకుపోయారు. పగతీర్చుకోవాలనే వారి తృష్ణ బైబిలు బోధకు విరుద్ధమని వారు గ్రహించారు. వారు కోపంతో మాత్రమే గాక, దోషంతోను నింపబడ్డారు.

*Revenge Redeemed* అనేవారి ఉద్వేగపు అనుభూతులతో ఒక పుస్తకం వ్రాయబడింది.[59] ఫ్రాంక్ ఎలిసబెతులు ద్వేషంనుండి ప్రేమకు వారు ఎలా కదిలారో, టామీ పిగాగేని వారు ఎలా క్షమించ నేర్చుకున్నారో, అతన్ని ఎలా సంఘ సభ్యునిగా చేసారో ఆ పుస్తకం వర్ణిస్తుంది. దాని చివరి కవరు మీద ఫ్రాంక్ అండ్ ఎలిసబెత్ మోరిస్ టామీ పిగాగేతో కూడిన ఫోటో ఉంటుంది.

అది దావీదు జరిగించినట్టయితే, మోరిస్ చేయగలిగినట్టయితే, మనంకూడా అలా చేయగలం "క్షమించి మరచిపోగల" పెద్దవారిగా ఉండగలుగునట్టు దేవుడు మనకు సహాయం చేయునుగాక.

## ముగింపు

పగతీర్చుకోవాలి అనే ఆలోచనలను విశదీకరించేటప్పుడు నేను నాల్గు పదబందాలను ఉపయోగించాను: “మూలాన్ని ఆలోచించు,” “అయ్యే ఖర్చును లెక్కించు,” “దేవుని చేతికి అప్పగించు,” “క్షమించి మరచిపో” అనేవి. పునరుక్తికి చెడ్డ పేరు; ఆరంభ రచయితలు “నలిగిన సామెత రాకుండా చూడు” అని అంటుండేవారు. పునరుక్తులను గూర్చి మనం కొన్ని సార్లు మర్చిపోయేదేమంటే– అవి నలిగిన సామెతగా ఎలా అయ్యాయా అని. అవి పునరుక్తులుగా ఎందుకు అవుతాయంటే – మనం చెప్పదలుచుకున్న వాటిని వివరించడంలో అవి గొప్ప పని చేస్తాయి. నేను యిచ్చిన నాలుగు సలహాలు పునరుక్తులు కావచ్చు. అయితే అవి గొప్ప బైబిలు సత్యాలను సూచించడానికి నిలుస్తాయి, ఆ సత్యాలు జీవించినప్పుడు మనశ్శాంతితో జీవించడానికిని, మనం మరణించినప్పుడు జీవాన్ని స్వతంత్రించుకోడానికిని పనికి వస్తాయి.

ఈ ప్రసంగాన్ని మన జీవితాలలో వ్యక్తిగతమైనదిగా తలుద్దాం. ఈ పాఠం యొక్క ఆరంభంలో నేను ప్రస్తావించిన, మెరిసే పగతీర్చుకునే పెట్టి ఉందా? అలాగైతే, ఆ బటన్ మీదనుండి నీ వ్రేలు తీసేయ్. గతంలో నిన్ను బాధించిన వ్యక్తి నీ జీవితాన్ని, నీ ఉద్వేగాలను తన స్వాధీనంలో ఉంచుకొంటాడు. నీ కాఠిన్యము వానిని బాధించలేదు. అది నిన్ను బాధిస్తుంది. నీ హృదయంలోనుండి త్రవ్వి – దాని “మూలమును గూర్చి ఆలోచించి,” దాని ఖరీదును లెక్కించి, దాన్ని పడవేయ్. దేవుని చేతికి విషయాలను అప్పగించు, దేవుడు తగిన సమయంలో, స్థలంలో దాన్ని సెటిల్ చేయనియ్యి. నీ మట్టుకైతే, కక్ష పగ భారాన్ని విసరివేసి – క్షమించి, మరచిపో.

---

## ప్రసంగము - దృశ్య సహాయాలు

**ప్రసంగపు నోట్సు:** అవమానాన్ని ఎలా సహించాలో మనకు తెలియదు ఎందుకంటే దాని పట్ల ఎలా మసలుకోవాలో మనం నేర్చుకోలేదు, బాధకు ఏలాటి వైఖరి కలిగియుండాలో తల్లిదండ్రులుగా మనం బిడ్డలకు నేర్పించాలి. “పగతీర్చుకొనడాన్ని గూర్చి మనం పిల్లలకు ఏమి ఉపదేశించాలి?” అనే కోణంలో ఈ ప్రసంగాన్ని వంచవచ్చు.

నేను బుద్ధిహీనంగా ప్రవర్తించాను లేక, “నేను వెర్రివాడనై బహుగా తప్పు చేసితిని” అన్న సౌలు ప్రస్తావన (1 సమూ. 26:21) అతని జీవిత సంగ్రహ చరిత్రను తెలుపుతుంది. “సొంతంగా చేసికొన్న వెర్రివాడు” అనేదానిపై చాల మంచి ప్రసంగాలు చేయవచ్చు.

కీర్తన. 7 1 సమూ. 24, 26 అధ్యాయాలలోని దావీదు సంభాషణతో సరిపోవచ్చు. దావీదు శత్రువులను గూర్చి యింకా అనేక అధ్యాయలు తెలుపుతాయి. వాటిలో బహు బలమైనది కీర్తన. 22.

**దృశ్య – సహాయముల నోట్సు:** రెడ్ బటన్ ఉన్న ఒక బాక్స్‌ను పరిచయంలోను, ముగింపులోను ఉపయోగించవచ్చు.

సూచనలు

[1]అమెరికావారు దగ్గరగా 19000000 కోర్టు కేసులు ఒక సంవత్సరానికి దాఖలు చేస్తారు. "కోర్టు కేసుతో అమెరికావారి ప్రేమ సంబంధం" అని ఒక న్యూస్ కామెంటేటర్ యిటీవల మాట్లాడాడు. [2]మత్తయి 5:39. [3]"మూలాన్ని ఆలోచించుమని" నేను చెప్పినప్పుడు, సౌలు మానసిక స్థితికంటే నా మనస్సులో ఎక్కువే ఉంది– దాన్ని మనం చూడబోతాం. [4]KJVని గమనించు. [5]సౌలు దావీదును అతని జనులను ఎందుకు చూడలేదు? మొదటిగా, కండ్లు చీకటికి సర్దుకోటానికి సమయం పడుతుంది. రెండవదిగా, దావీదును అతని 600 మంది జనులును గుహ యొక్క వెనుక భాగంలో ఉన్నారు. వారు రాళ్ల సందుల్లో దాగియుండవచ్చు. [6]ఇంకో ఉదాహరణనను ఆలోచించు: మిలిటరీలో ఉండేవారు మనిషికి కాదుగాని వారి అధికారానికి సెల్యూట్ చేయ నేర్పబడతారు. [7]NASBలోని ఫుట్ నోట్ చూడు. [8]ఈ లేఖనం మీద ఫుట్ నోట్ చూడు. "అనేక చేతి ప్రతులు: నీ మీదికి" అని కలుపబడి ఉంటాయి. KJVని యింకా యితర తర్జుమాలను చూడు. వాటిలో ఈ ప్రయోగం చేర్చబడియుంటుంది. [9]"ఒంటరిగానున్నప్పుడు" చేయమని ప్రభువు చెప్పాడు, అయితే యిది దావీదుకు వర్తించదు గనుక ఆ మాటలను నేను విడిచిపెట్టాను. తన ప్రాణాన్ని కోల్పోకుండ దావీదు సౌలుతో "ఒంటరిగా" మాట్లాడే మార్గమే లేదు. [10]ఈ స్థలంలో ఆ సమయంలో సౌలును ఎదుర్కొనడంలో తన ప్రాణానికే రిస్కు తీసికొన్నాడు. సౌలును అతని సైన్యం కొద్ది దూరంలోనే ఉన్నారు. దావీదు ఒకవేళ విజయం సాధించకపోతే, తన జనులు తమ ప్రాణాలకొరకు పోరాడవలసి వచ్చేదే.

[11]సౌలు పెద్దవాడు, రాజు ఆత్మసంబంధమైన నాయకుడై యుండాలి, లేక సౌలు తన మామయైయున్నాడనో, మొత్తానికి అది గౌరవం చూపడానికే. [12]మత్తయి 5:10–12 గమనించు. [13]సౌలుకు పశ్చాత్తాపం ఉంది – లేదు అనేది వేరే స్థలంలో చర్చించుతాం. [14]ఒక వ్యక్తి యొక్క జీవితంలో ప్రతి వివరణని వ్రాస్తే చీకాకుగా ఉంటుంది. [15]ఈ కర్మేలు యూదాకు సమీపంగా ఉంది. దేశానికి ఉత్తర భాగాన సముద్ర తీరంలో ఉన్న కర్మేలు పర్వతం కాదిది. [16]"ధనవంతుడు" అని తర్జుమా చేయబడిన హెబ్రీ పదానికి "బరువైన" అని అక్షరార్థం. [17]అతడు "కాలేబీయుడు" అని కూడా లేఖనం అంటుంది. అంటే, అతడు కాలేబు వంశీయుడైయుండవచ్చు. యెహోషువాతో నమ్మకమైన పనివాడు లేక (తక్కిన వివరాలు అగౌరవమైనవి) "కాలేబు" అనే దానికి "కుక్కవలె" అనేది మూలార్థం – అవమానకరమైన పదం. [18]అక్షరార్థంగా, "బెలియాలు కుమారుడు," అంటే "పనికిమాలిన కుమారుడు" అని భావం. [19]వింత సంగతులు సంభవించాయి. తమ శిశువులకు అనేక పేర్లు యివ్వబడతాయి ఎందుకంటే, అవి వినసొంపుగా ఉంటాయి గనుక, వాటి భావంతో ఆలోచన లేకుండానే అలా చేస్తారు. [20]శారా, బత్షెబ, వష్తి అనేవారు తక్కిన ముగ్గురు.

[21]సామెతలు 15:2; 18:6, 7; 29:11; మొదలైనవి. [22]KJV ఈ స్థలంలో సరియైన తర్జుమా కలిగియుంది, కాని "పుంలింగం" కోరతగింది. [23]సౌలుకును, స్వార్థపరుడైన నాబాలుకును సమాంతరాలను గీయవచ్చు. "నాబాలు" అంటే "బుద్ధిహీనుడు" అని భావం. ఈ అధ్యాయం లోను తరువాత దానిలోను సౌలు తన్ను తాను అలాగే చెప్పు కున్నాడు (1 సమూ. 26:21). [24]ఆమె దావీదుతోను తన జనులతో పాటు లైనులో నిలబడినవారిని సంతోషపరచవచ్చు. [25]మలాకీ 2:14; మత్తయి 19:6తో పోల్చి చూడు. [26]"ఆమె తన భర్తకు తెలుపలేదు" అని లేఖనం గుర్తిస్తుంది (1 సమూ. 25:19). ఆమె అతనికి లోబడడంలో తప్పిపోయిందా? నాబాలు ప్రాణాన్ని రక్షించబోతుంది గనుక, ఆమె నిందించబడుతుందని మనం తలంచం. [27]Swindoll added, "Especially one with a crockpot in her hands!" in "What To Feed an Angry Man" (N.p., n.d.), sound cassette. [28]"దేవుడు నీ ప్రాణాన్ని కాపాడి, నీ శత్రువుల ప్రాణాలను ఆయన తీయునని" 1 సమూ. 25:29లో ప్రత్యేకించి అబీగయీలు చిత్రిస్తుంది. [29]దావీదు తరువాత రాజౌతాడని అబీగయీలుకు ఎలా తెలుసు? "దావీదు పదివేలు చంపినట్టు" పాడిన పాటేమైనా తాను విన్నదా? అందునుబట్టి సాధారణంగానే ఎన్నిక చేయబడతాడని తలంచిందా? ఒకవేళ సౌలు మాటలే ఆ ప్రాంతంలో వ్యాపించాయా? (1 సమూ. 24:20) తన పలుకుల్లో కొన్ని దైవప్రేరేపితాలు ఉన్నట్టు కొందరు తలంచుతారు. [30]యాకోబు 3:17చూడు. అబీగయీలు తన సొంత భర్తతో మాట్లాడలేదు; ఆమె దావీదుతో మాట్లాడగలిగింది.

[31]"అభినందన కొరకు యింటికి వచ్చేదానికి బదులు అబీగయీలు మత్తుని చూడ యింటికి వచ్చింది" అని రిక్ అచ్లీ గుర్తించాడు. "Beauty and the Beast" (N.p., n.d.), sound cassette. [32]అతడు "రాయిగా అయ్యాడు" అని టెక్స్ట్ అంటుంది. [33]నాబాలు ప్రభువు ఉపమానంలోని రిచ్ ఫూల్‌కు మోడల్‌గా ఉన్నాడని

తలంపక తప్పదు లూకా 12:16–21. [34]అతని ప్రొపోజల్‌కు ఆమె రెస్పాన్స్ "ఆమె లేచి సాగిలపడి, నా యేలినవాని చిత్తము; నా యేలినవాని సేవకుల కాళ్లు కడుగుటకు నా యేలినవాని దాసురాలగు నేను సిద్ధముగానున్నాను" (25:41). "నీ వివాహానికి ఆమె అలా ప్రత్యుత్తరం యిస్తే, ఆమెనే చేసుకో!" అని స్వన్‌డ్‌లే సూచించాడు. [35]దీనికి బదులుగా 1 సమూ. 25:43, 44 గమనించు. 44 వచనంలో సౌలు మీకాలును వేరొకనికిచ్చాడు. అబీగయీలు దావీదుకు రెండవ భార్యయైనట్టు గుర్తిస్తుంది. సౌలు దావీదునుండి ఏది తీసివేస్తాడో, దేవుడు దాని స్థానంలో వేరొక దానిని ప్రసాదిస్తున్నాడు. [36]"అదే కథకు మరో రూపమని" కొందరు వ్యాఖ్యాన కర్తలు అంటారు. అయినా ఆలాటి దానికి రుజువేమీ లేదు. ఆ రెండు కథలకు అనేక వ్యత్యాసాలున్నాయి. [37]ఆ కొండయొక్క అసలైన స్థానమేదో తెలియదు. అది "యెషీమోను"కు సమీపంగా ఉంది, "అరణ్య మని" ఆ మాటకు అర్థం. అది జీఫు అరణ్యమునకు దగ్గరగా ఉంది (26:2). [38]"తన జనుల మధ్య సౌలు నిదురించుననే" వాస్తవం అందులోనే గుప్తమైయుంది (26:5). [39]అతడు దావీదుకు సహోదరియైన సెరూయా కుమారుడు (26:6) (1 దినవృ. 2:16ను పోల్చి చూడు). పదిమంది సంతతిలో దావీదు కనిష్టుడైనందున మేనళ్లుళ్లు, మేన కోడళ్లు తనకంటె పెద్దవారు కాకపోయినా కనీసం తనంతటి వయస్సు గలవారంటే వింత లేదు. [40]అంతగా యుద్ధం చేయవలసివచ్చే అందుబాటులో ఉంటుందని అక్కడ గుచ్చబడింది. ఆ క్యాంపు యొక్క "కేంద్ర స్థానమేదో" అది సూచిస్తుంది. సౌలు తన స్థానికి గుర్తుగా యీటెను ఉపయోగించాడు.

[41]అధ్యాయం 24లో, దేవుడు అతనికి ప్రతీకారం చేయుమని అతడు ప్రార్థించాడు (12వ.); అలా జరుగుతుందనే నమ్మికను అతడు వ్యక్తపరచాడు. [42]1 సమూ. 26:14 చూడు. దావీదు అబ్నేరును పిలిచినా, అది రాజుకే సంబంధించిన సంబోధనయని భావించాడు. ఎందుకంటే దినచర్యలో రాజును నేరుగా సంబోధించకూడదు. [43]సైన్యంలో అబ్నేరు వంటివాడు లేడన్నమాట వాస్తవం; సౌలు యొక్క కలతచెందిన జీవితంలో అబ్నేరువంటి, ధైర్యవంతులు, నమ్మకస్థులు సౌలుతో యింకెవరూ లేరు. అబ్నేరు మరణించినప్పుడు దావీదు వానిగూర్చి యిలా అన్నాడు. "–నేటి దినమున పడిపోయినవాడు, ఇశ్రాయేలువారిలో ప్రధానుడనియు పెద్దలలో ఒకడనియు మీకు తెలియును" (2 సమూ. 3:38). [44]పరిచయం చూడు. [45]అధ్యాయం 24లో, దావీదు తన సంభాషణలో ఈ అవకాశముందని ప్రస్తావించాడు. కూషు సౌలును రేపుతున్నట్టు చెప్పబడుతుంది. (కూషు, సౌలు బెన్యామీనీయులు; కీర్తన. 7 పరిచయం చూడు.) [46]దావీదుకు ప్రాంతీయ దేవుడు అనే భావన ఉన్నదని ఈ మాటల భావం కాదు; దేవుడు తన జనులతో ప్రత్యేకంగా ఉంటాడనే వాటి భావన. దేవుని ప్రసన్నత అతి పరిశుద్ధ స్థలంలో ప్రత్యేకమైన రీతిలో ఉంటుంది. [47]బైబిలులో ఎవనికంటెను ఎక్కువగా యిలా చెప్పాడు – అది అతన్ని ఎన్నడూ మార్చినట్టు లేదు. నిష్కపటమైన మారుమనస్సు పాపములు ఒప్పుకునే దానికి ముందు రానట్టయితే, అది నిష్ప్రయోజనము. [48]1 సమూ. 24:11. [49]1 సమూ. 25:44. [50]వచనం 18లో "యాషారు గ్రంథం" ప్రస్తావించబడింది. యెహోషువ 10:13లో కూడ. ఆరంభ పద్యముల సేకరణగా అది కన్పిస్తుంది.

[51]గాతు, అష్కెలోను అనేవి ఫిలిష్తీయుల పట్టణాలు. ఫిలిష్తీయ దేశమంతటి పట్ల అవి నిలుస్తాయి. [52]గిల్బోవ పర్వతం మీద శాప వచనం పలుకబడింది. సౌలు, యోనాతానులు అక్కడ మరణించారు. [53]డాళ్లు తోళ్ళతో చేయబడతాయి. అవి పగిలి పోకుండాలంటే నూనే పూస్తూ ఉండాలి; ఇప్పుడు సౌలు మృతినొందాడు, అతని ఆయుధములు అలక్ష్యం చేయబడ్డాయి. [54]సౌలు యుద్ధంనుండి కొల్ల సొమ్ముతో జయంగా తిరిగి వచ్చినట్టయితే, తన గౌరవార్థం అలాటి ఒక వేడుక జరపబడేదే. [55]ఇది వారి ఆయుధములకు కాక, సౌలు యోనాతానులను యిది సూచించి యుండవచ్చు. [56]పరిపూర్ణతకు తక్కువైన జీవితాలే మనమందరం జీవిస్తాం (రోమా 3:23). [57]William Painter in *The Palace of Pleasure*, quoted in Lewis Copeland, ed., *Popular Quotations for All Uses* (Garden City, N.Y.: Doubleday & Co., 1961), 392.

[58]దేవుడు "మన పాపములను యికను ఎన్నడు జ్ఞాపకం చేసికొనడు"; అయినా సర్వజ్ఞుడుగా అవి జరిగాయని ఆయనకు తెలుసు. [59]Bob Stewart, *Revenge Redeemed* (Tarrytown, N.Y.: Fleming H. Revell Co., 1991). ఈ పుస్తకాన్ని ఎవరైనా చదువవచ్చునని సిఫారసు చేయబడుతుంది. నేనెరిగినంతవరకు, ఈ పుస్తకం పాప్యులర్ ఆడియన్స్‌కు వ్రాయబడి మేజర్ పబ్లిషింగ్ హౌస్‌చే ప్రచురించబడింది. సంఘము రక్షణ యొక్క షరత్తులు అనే ఉపదేశం కలిగి ఉంటుంది.